క్లుప్తంగా

రోడ్డు వెంట పిచ్చి మొక్కలు తొలగింపు



పిడుగురాళ్ల: పట్టణంలోని కళ్లం టౌన్ షిప్, ఖలీల్ దాబా రోడ్డు వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పర్యవేక్షణలో శానిటేషన్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంతమంది వ్యాపారులు రోడ్డు వెంబడి వ్యర్థాలు పారబోస్తున్నారని, వాటి వల్ల అందరూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటి నుంచి ఇలా చెత్త పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిచ్చి మొక్కలు ఎప్పటికప్పుడు శానిటేషన్ సిబ్బందితో తొలగింపజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తీరిన కరెంట్ కష్టాలు



పిడుగురాళ్ల: పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పులిచింతల పునరావాస కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, తీగలు మరమ్మతులకు గురై తరచూ సరఫరాకు అంతరాయం కలిగేది. దీంతో సాక్షిలో కరెంట్ కష్టాలు శీర్షికన గురువారం కథనం ప్రచురించిన విషయం విదితమే. శుక్రవారం స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు.. పూర్తిగా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగలు కూడా కొత్తవి వేశారు. దీంతో ప్రజలకు కరెంట్ కష్టాలు తీరాయి. ఆ ప్రాంత ప్రజలు సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తక్షణమే స్పందించిన విద్యుత్ అధికారుల తీరుపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో వైద్య శిబిరాలు శుక్రవారం కూడా కొనసాగాయి. వాంతులు, విరోచనాలు, జ్వరాలబారిన పడిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ప్రాథమిక చికిత్స అందించిన తరువాత అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీలు, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి, గుంటూరు ఆసుపత్రులకు తరలించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు ఇమ్మడిశెట్టి అమూల్య, మధు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. వాంతులు, విరోచనాల బారినపడిన వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి ధైర్యం చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అవగాహన కల్పించారు.

సకాలంలో సమస్యల పరిష్కారం ముఖ్యం



రెంటచింతల: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారి పనులు సకాలంలో పూర్తి చేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని తహసీల్దార్ కె. నగేష్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు సర్టిఫికెట్లు కూడా నిర్ణీత గడువులో అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని కోరారు. పనులపై వచ్చే వారిని ఇబ్బంది పెట్టకుండా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఆర్ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై శనగలు పంపిణీ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రైతులకు రాయితీపై శనగలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామానికి చెందిన రైతులకు శనగలు పంపిణీ చేసి మాట్లాడారు. కేజీ శనగలు రూ.70.50కే అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు వారి పట్టాదారు పాస్ పుస్తకం నకలును స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

వరిపై తెగుళ్ల దాడి

ఆరుగాలం శ్రమించే అన్నదాతలను అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. కొన్నేళ్లుగా నాగార్జున సాగర్ కుడికాలువ నీళ్లు రాక సకాలంలో వరి పండించలేకపోయారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల రాకతో డ్యాంలు నిండి కాలువ నీరు రావటంతో వరి పంటకు శ్రీకారం చుట్టారు. ఖరీఫ్ దిగుబడులపై ఆశలు పెంచుకుంటున్న రైతన్నలకు పురుగు రూపంలో తెగుళ్లు దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయి. ఈ ఏడాది అసలే సాగుకు సాయం అందలేదన్న నిరాశతో ఉన్న అన్నదాతలకు అప్పోసప్పో చేసి పండిస్తే తెగుళ్లు అడ్డుపడుతున్నాయి. దీంతో అదనపు భారం భరించలేక నిరాశకు గురవుతున్నారు.



పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- నివారణకు తప్పని ఖర్చుల భారం
- ప్రభుత్వం నుంచి లభించని భరోసా



వరి పంటపై తెగుళ్ల దాడి దృశ్యం

మాచర్ల రూరల్ ఖరీఫ్, వరి పంటపై తెగుళ్ల దాడి చేయటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. సాగు ఖర్చు పెరగటంతో ఈ ఏడాది ఇప్పటికే అధిక మొత్తంలో ఖర్చు చేశారు. ఇప్పుడు తెగుళ్ల నివారణకు అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. వరి పంటకు ఆకుముడత, పాము పాడ తెగులు ఆశించింది. దీని నివారణకు పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. ఎకరాకు రూ. 600 నుంచి రూ. 800 ఖర్చు చేస్తుంటే, మరికొందరు రూ. 1000 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నుంచి జనవరి మధ్యలో ఆకుముడత ఉధృతి ఎక్కువగా ఉంటుంది. లద్దె పురుగు వరి పైరు రెండు ఆకుల మధ్యలో గొట్టంలా చేసి మధ్యభాగం తినేస్తుంది. దీని వలన దిగుబడి తగ్గడంతోపాటు ఖర్చు పెరిగి రైతులకు భారం తప్పదు. వ్యవసాయాధికారులు సలహాలిచ్చేందుకు కూడా అందుబాటులో లేకపోవటం మరింత ఇబ్బందిగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగు సాయమేది?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కాగానే రైతు భరోసా కింద సాయం అందేది. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. ప్రస్తుత కూటమి పాలకులు ఈ పథకం పేరు మార్చడం తప్ప సాయం మాత్రం చేయలేదు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పంట వేశారు. సరిగా పండకపోవటంతో అప్పులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు తెగుళ్ల రూపంలో మరో పిడుగు వారి నెత్తిపై పడింది.

సహాయం అందలేదు



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. పెట్టుబడి సాయం ఈ ప్రభుత్వం ఇంత వరకు అందించలేదు. గతంలో క్రమం తప్పకుండా రైతు భరోసా పేరుతో అకౌంట్‌లో జమ చేశారు. అప్పు చేసి వ్యవసాయ పనులు చేస్తున్నాం. పంట దిగుబడి సమయంలో పాడ తెగులు, దోమ సోకింది. వీటి నివారణకు ఇప్పటి వరకు రూ. 2,400 విలువ చేసే మందులు పిచికారి చేశాను.

– బొద్దు నరసింహారావు, రైతు, జమ్మలమడక

యూరియా వినియోగం తగ్గించాలి



రైతులు వ్యవసాయ శాఖాధికారుల సిఫార్సు చేసిన మేరకు వరి పంటకు రెండు విడతల్లో మాత్రమే యూరియా చల్లాలి. అధిక మొత్తంలో వినియోగించటం వలన పంట పూర్తిగా పచ్చదనంగా మారి పురుగులను ఆకర్షిస్తుంది. తెగుళ్ల ఉధృతికి ఇది కారణమవుతుంది. పొలం గట్లపై గడ్డితోపాటు కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పిచికారి చేసేటప్పుడు పొలంలో నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల సూచన మేరకు తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారి చేయాలి.

– ఏడీఏ జగదీష్‌రెడ్డి

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే డయేరియా మరణాలు

గురజాల వైఎస్సార్ సీపీ నాయకుడు చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో డయేరియా మరణాలకు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణమని గురజాల వైఎస్సార్ సీపీ నాయకుడు, పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... పట్టణంలో సరైన తాగునీటి సదుపాయం, మురుగు నీటి పారుదల వ్యవస్థ, వైద్య వసతులు లేవన్నారు. ఈ కారణంగా డయేరియా సోకి మృతి చెందారని తెలిపారు. వెంటనే కూటమి ప్రభుత్వం తగిన ప్రాథమిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించాలని, ఆయా కుటుంబాలలో ఒకరికి ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గం, చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. పల్నాడు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

జెట్టిపాలెం(రెంటచింతల): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించి మెరుగైన ఫలితాలు రాబట్టాలని మండల ప్రత్యేక అధికారి వి. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జెట్టిపాలెం గ్రామ శివారు ఏపీ మోడల్ స్కూల్, కళాశాలను ఆయన ఎంపీడీఓ సరోజినీదేవి, ఎంఈఓ-2 వై. శివనాగేశ్వరావుతో కలిసి సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులను, విద్యార్థుల భోజనాన్ని, హాజరు పట్టికలను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. కచ్చితంగా సమయ పాలన పాటించి గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.పాపయ్య, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న వి. శ్రీనివాసరావు

సాయిబాబాకు ప్రజా సంఘాల నివాళి

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబాకు శుక్రవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరించి జీవిత ఖైదీలుగా జైల్లో మగ్గించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనన్నారు. జీవితాంతం ప్రజల పక్షాన నిలిచిన నేరానికి పదేళ్లు జైలు శిక్ష అనుభవించి, అనారోగ్యం పాలై సాయిబాబా మరణించారని పేర్కొన్నారు. ఆయన మృతికి కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వర్లు, కేఎస్‌పీఎస్ నాయకులు కె. కృష్ణ, భారత్ బచావో నాయకులు నవజ్యోతి, సర్దార్, ఎంసీపీఐ నాయకులు ఓర్సు కృష్ణ, పీడీఎం నాయకులు కృష్ణానాయక్, సీపీఎం నేత టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన

దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోగా.. బాధిత కుటుంబ సభ్యులు స్థానిక ముత్యాలంపాడు రోడ్డు వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. దాచేపల్లిలో నివాసం ఉంటున్న షేక్ నాగుల్‌మీరా(35) అనే వ్యక్తి తెలంగాణలోని దామరచర్ల మండలం వాడపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారితో మాట్లాడారు. ఘటన వాడపల్లి వద్ద జరిగిందని, అక్కడి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించటంతో ఆందోళన విరమించారు. నాగుల్‌మీరా అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఆటోలో వాడపల్లి వైపు నుంచి దాచేపల్లికి తీసుకువస్తున్న క్రమంలో టైర్ పంక్చర్ కావటంతో ప్రమాదం జరిగి మృతి చెందాడు. నాగుల్‌మీరాకి భార్య హుస్సేన్‌బీ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.



దాచేపల్లిలో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్

మాచర్ల రూరల్: భద్రతకు ఆర్టీసీ బస్సులు నిదర్శనంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో నూతనంగా ఏడు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మాచర్ల నుంచి గుంటూరు, విజయవాడకు కొత్తగా ఈ బస్సులను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. మరో ఐదు రాబోతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే చెన్నై, బెంగళూరుకు సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్పిస్తున్న సౌకర్యాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత దూర ప్రాంతాలైన విశాఖ, తిరుపతికి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం బత్తుల వీరాస్వామి, అసిస్టెంట్ మేనేజర్ హజారయ్య, బాషా, కుర్రి వీరారెడ్డి, టీడీపీ నాయకులు కుర్రి శివారెడ్డి, కేశవరెడ్డి, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, కొమెర దుర్గారావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సౌర పలకలు

దాచేపల్లి : సబ్సిడీపై సౌర పలకలు అందిస్తామని నోడల్ అధికారి నూతలపాటి సింగయ్య అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమావేశం శుక్రవారం జరిగింది. సౌర పలకల సబ్సిడీపై అవగాహన కల్పించారు. సింగయ్య మాట్లాడుతూ.. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సౌర పలకలు అందిస్తామన్నారు. ప్రతి వినియోగదారుడికి ప్రభుత్వం నుంచి 75 శాతం సబ్సిడీ వస్తుందని, సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు కూడా ఇస్తాయని ఆయన వివరించారు. సోలార్ ప్యానెల్ 25 సంవత్సరాలు పని చేస్తుందని, విద్యుత్ సంస్థల మనుగడకు సూర్యుడు ప్రసాదించిన కాలుష్య రహిత సౌరశక్తి ముఖ్యమని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఏడీఈ వీరేశ్వరరావు, ఏఈలు భగవాన్ నాయక్, దండే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి సింగయ్య

గర్భిణుల వివరాల నమోదు అవసరం

పిడుగురాళ్ల రూరల్: గర్భిణుల వివరాలను ప్రతి నెల నమోదు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి అన్నారు. పట్టణంలోని కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ ఉండాలని తెలిపారు. ప్రతి నెల వారిని పరీక్షించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. అనంతరం హాస్పిటల్‌లోని రికార్డులను పరిశీలించారు. జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, వైద్యులు డాక్టర్ కేవీ నాగిరెడ్డి, కేవీ ప్రవీణ్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పద్మావతి

కర్మాగారంలో ప్రమాదాల నివారణకు చర్యలు

మాచర్ల రూరల్: నాణ్యతతోపాటు పర్యావరణ పరిరక్షణకు కేసీపీ సిమెంట్స్ యాజమాన్యం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం కేసీపీ సిమెంట్స్ మెయిన్స్‌లో భద్రతా వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. భద్రతలో యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు కార్మికులు కూడా సహాయ, సహకారాలందిస్తే ప్రమాద రహిత కర్మాగారంగా పేరు వస్తుందన్నారు. ఇప్పటి వరకు సంస్థకు ప్రమాదరహితమని దేశవ్యాప్తంగా మంచి పేరు ఉందన్నారు. కార్మికులు, యాజమాన్యం సమష్టి కృషితో ప్రమాద రహిత ప్రదేశంగా కేసీపీని నడపటం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఐబీఎం టీం సభ్యులు మైన్స్ మేనేజర్ పి రాజేష్‌రెడ్డి, ఏపీఎండీసీ లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ కె.మహేశ్వరరెడ్డి, ది శ్రీ జయ జ్యోతి సిమెంట్స్ లిమిటెడ్ మెకానికల్ ఇంజినీర్ ఎస్. నవీన్‌రెడ్డి హెచ్ఆర్ఎస్, వెల్ఫేర్ ఆఫీసర్, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు స్వాధీనం

మాచర్ల రూరల్: పట్టణంలోని బేకరీ, చికెన్, టిఫిన్, హోటల్స్, రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రింగురోడ్డు సెంటర్‌లోని ఓ బేకరీ, రెస్టారెంట్‌లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన మాంసం, బేకింగ్, ఇతర తినుబండారాలను వారు కనుగొన్నారు. ఇవి బూజు పట్టి దుర్వాసన వస్తున్నా, విక్రయించటానికి సిద్ధం చేస్తున్న యాజమాన్యం తీరుపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిల్వ ఉంచిన మాంసాహారాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు హోటల్స్, రెస్టారెంట్లు, టిఫన్ బండ్లను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించామని, ఎవరైనా నిల్వ ఉన్న ఆహారాలను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బేకరీలో తనిఖీ చేస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు పట్టణ ఇన్‌ఛార్జి ఏఈ రాంబోట్లు తెలిపారు. కొండమోడు సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 – 9 , సాయంత్రం 5 – 6 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

ఆహార భద్రతపై శిక్షణ ముఖ్యం

దాచేపల్లి: ఆహార భద్రతపై వ్యాపారులు శిక్షణ పొందాలని ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర ట్రైనర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు వ్యాపార సంస్థలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడారు. ఆహార భద్రత స్టాండర్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ప్రజలు తినే ఆహార సంబంధమైన సరుకులు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా శిక్షణ పొందాలని సూచించారు. ఆహార భద్రత అధికారులు ఇచ్చే సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఆయన చెప్పారు. ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తులు విక్రయించాలని ఆయన సూచించారు.

89 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన వారితో అధికారులు

పిడుగురాళ్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 89 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ మేరకు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ. తమ్మాజీరావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించామన్నారు. 136 మంది హాజరు కాగా, 89 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మేళా నిర్వహించటం సంతోషకరమన్నారు. ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎం. రవీంద్రనాయక్, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ టి. శ్రీకాంత్, వీరాంజనేయులు, మస్తాన్, రామాంజనేయులు, ఏపీఎం ఎన్. కోటేశ్వరరావు, కంపెనీ హెచ్‌ఆర్‌లు, ప్రతినిధులు, సీడాప్ పీవో నాగుల్, ఏఆర్‌పీ నానిక్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు యంత్రాంగంలో కదలిక

అంజనాపురం కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీ సమస్యలపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. స్థానికులు పెద్దసంఖ్యలో డయేరియా బారిన పడటంతో కాలనీవాసుల్లో ఆందోళన నెలకొంది. వైద్య సిబ్బంది కాలనీలో ఉచిత శిబిరాలను కొనసాగిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



ఇళ్ల ముందు నిలిచిన బురద చూపుతున్న కాలనీవాసులు



పొక్లయిన్‌తో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం



రోడ్డుపై బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

పాఠశాలలో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

కారెంపూడి: మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి కారెంపూడి గ్రామ సచివాలయం -1, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల మెయిన్‌ను, అదే కాంపౌండులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. 205 మంది పిల్లలకుగాను 18 మంది పాఠశాలకు ఎందుకు రాలేదనే విషయమై హెచ్ఎం నుంచి వివరణ తీసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం రికార్డులు పరిశీలించారు. ప్రతి ఉద్యోగి విధులు కచ్చితంగా నిర్వర్తించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల పట్ల మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. అందరూ బడికి సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పిదాలు చోటుచేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డీ సత్యప్రసాద్, ఎంఈఓ రవికుమార్, ఏపీఓ కోటిరెడ్డి, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.